**నోట్ ఆన్** **తేది.30.11-2018.**

# ఫైనాన్సియర్ గగారిన్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్యకు పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్ట్

ది.23.11.18న మధ్యాహ్నం సుమారు 01.30 గంటల ప్రాంతంలో విజయవాడ గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి చిలుకు దుర్గయ్య వీధిలో ఉన్న మూన్ మూన్ ప్లాజాలో దేవరపల్లి గగారిన్ (58) అనే ఫైనాన్స్ వ్యాపారి తన కార్యాలయంలో ఉండగా అతని పై ఒక వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పంటించి బయటికి పారిపోయిన సంఘటన చొటుచేసుకుంది. అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటనలో మంటల్లో చిక్కుకున్న గగారిన్ రక్షించాలంటూ బిగ్గరగా కేకలు వేస్తూ ప్లాజా నుండి రోడ్డుపైకి వచ్చి కుప్పకూలిపోయాడు. అనంతరం చుట్టు ప్రక్కల వారు వచ్చి కాలిన గాయాలతో ఉన్న గగారిన్‌ను హాస్పటల్‌కు తరలించడం జరిగింది. 80 శాతం వరకు తీవ్రమైన కాలిన గాయాలపాలైన గగారిన్ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ ది.26.11.2018న తెల్లవారు జామున మృతి చెందాడు. జరిగిన సంఘటనపై గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో తొలుత హత్యాయత్నం క్రింద కేసు నమోదుచేసి చనిపోయిన తరువాత హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది.

ప్రాథమిక దర్యాప్తులో గగారిన్ మృతి చెందకమునుపు అతని నుండి వాంగ్మూలం తీసుకోవడంతో పాటు చుట్టు ప్రక్కల నివాసితులు, బంధువులు మరియు కుటుంబ సభ్యులను విచారించి దాడికి గురైన గగారిన్‌కు సంబంధించి ఆర్థిక వివాదాలు మరియు ఆస్థి లావాదేవీలు మరియు ఇతనిపై ఎవరికైనా పాత కక్ష్యలున్నాయా అనే అంశంపై మరింత సమగ్ర సమాచారం సేకరించడంతో పాటు ప్లాజాలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ సేకరించి దాడికి పాల్పడిన నిందితుల ఆనవాళ్ళను మరియు దాడికి దారితీసిన పరిస్థితులను గుర్తించడం జరిగింది. పక్కా ప్రణాళికతో గగారిన్‌పై పెట్రోల్ దాడి జరిగినట్లు దర్యాప్తులో గుర్తించడం జరిగింది.

ఈ నేపథ్యంలో ది.29.11.2018న ఈ కేసులో నిందితులైన కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం తిప్పనగుంట గ్రామానికి చెదిన మద్దాల సురేష్ (40) మరియు విజయవాడ మొగల్‌రాజుపురం శిఖామణి సెంటర్‌కు చెందిన మద్దాల సుధాకర్‌లను (41)లను అరెస్ట్ చేసి, క్షుణ్ణంగా విచారించడంతో దాడికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడయ్యాయి.

శిఖామణి సెంటర్‌కు చెందిన మద్దాల ప్రసాద్ అనే వ్యక్తి బ్యాంకులో కొంత లోను తీసుకుని శిఖామణి సెంటర్‌లో ఒక భవనం నిర్మించడం జరిగింది. బ్యాంక్‌లోను సకాలంలో చెల్లించలేక మద్దాల ప్రసాద్ ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్న దేవరపల్లి గగారిన్ అనే వ్యక్తి వద్ద రూ.40.75 లక్షలకు సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయించి రిజిస్ట్రేషన్ ఒప్పందం పత్రాలపై ప్రసాద్‌తో సంతకాలు పెట్టించుకుని ప్రసాద్‌కు తెలియకుండా గగారిన్ తన భార్య పేరుమీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు.

ఇది తెలిసి ప్రసాద్ కుమారులైన మద్దాల సురేష్ మరియు సుధాకర్‌లు తమ తండ్రి ప్రసాద్‌ను నిలదీయగా తాను ఇంటిని విక్రయించలేదని, గగారిన్ అనే వ్యక్తి వద్ద సంబంధిత ఆస్థి తనఖాపెట్టి రూ.30 లక్షలు తీసుకున్నానని చెప్పినాడు. ఈ క్రమంలో వివాదంలో ఉన్న భవనం తమదంటే తమదంటూ గగారిన్ మరియు ప్రసాద్ కుమారుడైన మద్దాల సురేష్ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ప్రస్తుతం న్యాయ స్థానంలో విచారణ క్రమంలో ఉంది.

***(మిగతా 2వ పేజీలో ...)***

ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య పలు మార్లు గొడవజరిగి గగారిన్ ఒక వైపు మరియు సురేష్, సుధాకర్ వారి బంధువులు ఒకరిపై ఒకరు మాచవరం పోలీస్‌స్టేషన్ నందు కేసులు పెట్టుకొన్నారు. ఆ కేసులు ప్రస్తుతం విచారణలో ఉన్నాయి. దీనిపై సురేష్ పథకం పన్ని అన్నదమ్ములు ఇద్దరూ కలసి గగారిన్‌ను హతమార్చాలని నిర్ణయించి పథకం అమల్లో భాగంగా ది.22.11.2018న గగారిన్ ఉంటున్న మూన్ మూన్ ప్లాజా వద్దకు వెళ్ళి సురేష్ రెక్కీ నిర్వహించడం జరిగింది. గగారిన్‌ను ఎలాగైనా హత్య చేయాలని గట్టిగా నిర్ణయించుకుని ది.23.11.2018న కృష్ణాజిల్లా తిప్పనగుంటలో తన ఇంటి వద్ద నుండి కొబ్బరిబోండాలు నరికే కత్తిని మరియు వెడల్పు మూత గల ప్లాస్టిక్ డబ్బాను తీసుకుని రెంటినీ ఒక బ్యాగ్‌లో పెట్టుకుని తిప్పనగుంట నుండి మోటారు బైక్‌పై బయలుదేరి పెట్రోల్ బంకులో ప్లాస్టిక్ బాటిల్‌లో పెట్రోల్ తీసుకుని మూన్ మూన్ ప్లాజా వద్దకు సురేష్ చేరుకోవడం జరిగింది. అనంతరం అక్కడ నుండి నేరుగా గగారిన్ ఉంటున్న కార్యాలంలోనికి ప్రవేశించిన సురేష్ డబ్బాలో ఉన్న పెట్రోల్‌ను గగారిన్‌పై పోసి, నిప్పు అంటించి పారిపోవడం జరిగింది. పారిపోయే క్రమంలో సురేష్ బ్యాగ్‌లో ఉన్న కత్తి క్రింద పడిపోవడం జరిగింది.

అత్యంత రద్దీగా ఉండే గవర్నరపేట ప్రాంతంలో అలజడి కలిగించిన సంచలనంగా మారిన ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నగర పోలీస్ కమీషనర్ శ్రీ సి.హెచ్.ద్వారకా తిరుమలరావు ఐపిఎస్ గారు నేరస్థులను త్వరితగతిన పట్టుకుని ఈ కేసును చేధించేందుకు లా & ఆర్డర్ డిసిపి శ్రీ వెంకటప్పల నాయుడు గారి ఆధ్వర్యంలో సౌత్‌జోన్ ఏసిపి శ్రీ జి.వి.రమణమూర్తి, సూర్యారావుపేట ఇన్‌స్పెక్టర్ శ్రీ సత్యన్నారాయణ గార్ల ఆధ్వర్యంలో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రధాన నిందితుడు మద్దాల సురేష్‌తో పాటు హత్యకు సహకరించిన ఇతని సోదరుడు మద్దాల సుధాకర్‌ను ది.29.11.2018న అరెస్ట్ చేయడం జరిగింది.

-- xx --